


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 21-12-2022 సంపుటి : 04 సంచిక : 106 పేజీలు : 4 వెల : రూ 3-00


## కెప్టెన్‌గా.. అరుదైన ఆ ఘనత సొంతం



రాష్ట్రాన్ని ముందుండి నడిపిస్తున్న నాయకుడు వైఎస్ జగన్.. చదువుకునే రోజుల్లోనూ ఎంతో చరుకుగా ఉండేవాడు. ఆ సమయం నుంచే ఆయనలో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా కనిపించాయి.అదే ఆయన చేత అరుదైన ఘనతను సాధించి పెట్టాయి.తండ్రి కంటే తాత దగ్గరే జగన్‌కు చనువెక్కువ. అందుకే స్కూల్‌లో చదువుతున్న రోజుల్లో కూడా సెలవులొస్తే చాలు పులివెందుల రావడం, తాత వాడే జీపులో ఊరంతా తిరగడం అలవాటుగా ఉండేది. హైదరాబాద్‌లో ఉన్న తల్లిదండ్రులకు ఈ విషయం తెలిసేది కాదు. పైగా పులివెందులలోనూ ఒక మిత్రబృందం ఉండేది. వాళ్లందరినీ గుమికూడ్చి క్రికెట్ ఆడడం కూడా ఒక అలవాటుగా మారిపోయింది.హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఐసిఎస్ఇ సిలబస్ కావడంతో.. అక్కడే 12వ తరగతి వరకూ చదివే వెసులుబాటు ఉండేది. అక్కడ చదివినంత కాలం ఏ ఒక్క ఆటకూ పరిమితం కాకుండా క్రికెట్, బాస్కెట్ బాల్ లాంటి రకరకాల ఆటల మీద ఆసక్తికనబరిచేవాడు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2లో ఉండే శ్రీబాగ్ ఇంటి దగ్గర కూడా స్నేహితుల బృందంతో కలిసి క్రికెట్ ఆడేవాడు. చదవులో సగటు విద్యార్థి కంటే కాస్త ఎక్కువ అనిపించుకున్నా, అందరితో బాగా కలిసి మెలసి ఉండటంలో మాత్రం చురుగ్గా ఉండేవాడని స్కూల్ టీచర్లు, సిబ్బంది చెబుతారు.డాక్టర్ రాజశేఖరరెడ్డి వ్యక్తిగత సహాయకుడిగా ఉన్న సూరీడు, రోజూ మారుతీ కారులో జగన్‌మోహన్‌రెడ్డిన డ్రాప్ చేసి పికప్ చేసుకునేవాడు. నిజానికి మధ్యాహ్నం మూడు గంటలకే క్లాసులు పూర్తయినా, సాయంత్రం దాకా స్కూల్లోనే మిత్రులతో ఉండిపోయేవాడు. అలా హాస్టల్లో ఉండే మిత్రులతో కలిసి ఎక్కువసేపు గడపటానికి జగన్ ఇష్టపడేవాడు. మళ్లీ ఇంటికి వెళ్లగానే చదువు మామూలే.అలా అందరినీ కలుపుకుపోయే నాయకత్వ లక్షణాలుండటం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ హౌజ్ కెప్టెన్ అయ్యేందుకు కారణమైంది. స్కూల్లో ఉన్న విద్యార్థులందరినీ నాలుగు హౌజ్‌లుగా విభజించడం అక్కడ ఆనవాయితీ. వాటికి రెడ్ హౌజ్, బ్లూ హౌజ్, గ్రీన్ హౌజ్, ఎల్లో హౌజ్ అని పేర్లు. ఏ పోటీలు జరిగినా.. ఆ నాలుగు హౌజ్‌ల మధ్యే జరుగుతాయి. అంటే క్రికెట్ అనగానే ఈ నాలుగు జట్ల మధ్య జరిగే పోటీలో విజేతను నిర్ణయిస్తారు. అదే విధంగా ఖో ఖో, బాస్కెట్ బాల్.. ఏదైనా అంతే. ఆటలతో పాటు వక్తృత్వం, వ్యాసరచన లాంటి పోటీలూ జరుగుతాయి. ఏటా జరిగే ఈ పోటీల్లో ఆల్ రౌండ్ చాంపియన్‌షిప్ సాధించడం ఒక ప్రతిష్టాత్మకమైన విషయం. 12వ తరగతిలో ఉన్నవాళ్లకి మాత్రమే హౌజ్ కెప్టెన్సీ దక్కుతుంది. అలా.. జగన్ 12వ తరగతిలో ఉన్నప్పుడు రెడ్ హౌజ్‌కు కెప్టెన్ అయ్యాడు. పైగా ఆ సంవత్సరం తన హౌస్‌కు ఆల్ రౌండ్ ఛాంపియన్‌షిప్ సాధించిన ఘనత కూడా దక్కించుకు న్నాడు. అంతకు ముందుగా పదేళ్లుగా రెడ్ హౌజ్‌కు దక్కని గౌరవం.. జగన్ ఉన్నప్పుడే దక్కిందని మిత్రులు చెప్తుంటారు. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. జగన్‌మోహన్‌రెడ్డి కంటే ముందు రెడ్ హౌస్ కెప్టెన్‌గా వ్యవహరించింది చెన్నారెడ్డి మనవడు ఆదిత్యరెడ్డి(శశిధర్ రెడ్డి కుమారుడు). హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఆదిత్యరెడ్డి 12వ తరగతి చదువు, రెడ్ హౌస్ కెప్టెన్సీ ముగిసిన సంవత్సరమే చెన్నారెడ్డి సీఎం పదవి నుంచి దిగిపోయారు. ఆ సంవత్సరం ఆయన స్థానంలో ముఖ్య మంత్రి అవుతారనుకున్న రాజశేఖర్‌రెడ్డి కాలేకపోయారు గానీ, ఆదిత్యరెడ్డి స్థానంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రెడ్ హౌస్ కెప్టెన్ పదవి మాత్రం జగన్‌మోహన్‌రెడ్డిని వరించింది.

## బిజినెస్‌లో ఆయనో సక్సెస్ పాఠం.. దార్శనికుడిగా పరిశ్రమలకు ఊతం



చదువు పూర్తవగానే బిజినెస్‌లోకి ఎంటర్ అయ్యారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రాజకీయాల కన్నా చాలా ముందే ఆయన వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. అక్కడా అదే పట్టుదల, ప్రతి విషయం తెలుసుకోవాలనే శ్రద్ధ, ఏకాగ్రత, సక్సెస్ కావడమే లక్ష్యం.లక్ష్యసాధన దిశలో ఆయన ఎంత కష్టానికైనా సిద్ధమయిపోయారు. కష్టపడ్డారు. విద్యుత్, సిమెంట్, మీడియా రంగాల్లో అనితర సాధ్యమైన విజయాలు సాధించారు. ఆ క్రమంలో ఆయన దార్శనికత బాగా ఉపయోగపడింది. ముందుచూపుతో కూడిన నిర్ణయాలు కార్పొరేట్ రంగంలో ఆయననొక ప్రత్యేక వ్యక్తిగా నిలిపాయి. ఆయన్ను సన్నిహితంగా గమనించిన కార్పొరేట్ రంగ నిపుణులు, కంపెనీల యజమానులు అదే విషయాన్ని పదేపదే చెబుతుంటారు.వైఎస్ జగన్ ఏదో ఆషామాషీగా వ్యాపార రంగంలోకి రాలేదు. అప్పుడాయనకు రాజకీయాలు ప్రయారిటీ కూడా కాదు. డీప్ స్టడీతో, లోతైన అవగాహనతోనే ఆయన బిజినెస్ రంగంలోకి దిగారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా గమనించారు. ప్రశ్నలు వేసి మరీ తెలుసుకున్నారు. ఆయన ప్రతి విషయాన్ని డీప్‌గా తెలుసుకుని నిపుణుల్ని అడిగేవారు. బిజినెస్ రంగంలో ఆయనకున్న అపారజ్ఞానం వల్లే ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ నేడు ఏపీ ముందంజలో వుంది. ఏ పరిశ్రమలు ఎక్కడ అవసరం, ఎక్కడి పరిస్థితులు అనుకూలం, ఏ ప్రాంతానికి ఉపయోగం అన్న విషయాలను గమనింపులోకి తీసుకునే సీఎంగా పారిశ్రామిక విధానం తెచ్చారు.

భారతి సిమెంట్స్ బెస్ట్ ఎగ్జాంపుల్

జగన్‌గారు గొప్ప విజనరీ అని చెప్పడానికి భారతి సిమెంట్స్ బెస్ట్ ఎగ్జాంపుల్. ఆ ఫ్యాక్టరీ పెట్టేటప్పుడు మేము ఎన్నో ఒడిదొడుగులు ఎదుర్కొన్నాం. సాంకేతికత విషయంలో జగన్‌ది రాజీలేని ధోరణి. రీసెర్చ్ ఓరియెంటెడ్ మెంటాలిటీ. ఉపాధి అవకాశాల కల్పన జగన్గారి ప్రయారిటీ అంశం. భారతీ సిమెంట్స్ ఈరోజు సక్సెస్‌ఫుల్ వెంచర్ కావడానికి కర్త, కర్మ, క్రియ అన్నీ జగన్ గారే అంటారు

లోతుగా తెలుసుకుంటారు..

జగన్ గారు సిమెంట్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టేముందు వైఎస్సార్ గారి ద్వారా నాకు పరిచయమయ్యారు. తనకు ఏమీ తెలీదన్న జగన్.. చెప్పిందంతా ఎంతో శ్రద్ధగా విన్నారు. మరోసారి చెప్పించుకున్నారు. ఆ తర్వాత నాకు తెలిసింది ఏంటంటే, ఏ విషయాన్నయినా ఎంత లోతుగా తెలుసుకుంటే అంత మేలన్నది జగన్ స్వభావమని. పరిశ్రమల విషయంలో ఆయనకు అన్ని విషయాలు తెలుసు. అందుకే నేడు ముఖ్యమంత్రిగా సంక్షేమ పథకాల విషయంలో గొప్ప పేరు తెచ్చుకుంటూనే, దార్శనికుడిగా పరిశ్రమలకు ఊతమిస్తున్నారు. జగన్ హయాంలో కచ్చితంగా పారిశ్రామిక రంగం అభివృద్ధి శిఖరాలు చేరుకుంటుందని నాకు గట్టి నమ్మకం.

ప్రసాదరెడ్డి, బిజినెస్ వ్యవహారాల నిపుణుడు

అది సామాన్యమైన విషయం కాదు

ఆంధ్రప్రదేశ్‌లో పారదర్శకంగా, వేగంగా తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. కరోనా మహమ్మారి సవాళ్లను అధిగమించి, పారిశ్రామికాభివృద్ధి సాధించడమన్నది సామాన్యమైన విషయం కాదు. అది ఏపీలో సీఎం జగన్ సాధించి చూపారని సాగర్ సిమెంట్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. 2019 జూన్ నుండి 2022 జూన్ వరకు భారీగా పెట్టుబడులు వచ్చాయి. మూడేళ్లలో 30వేల 645 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. మూడేళ్లలో రూ.47వేల కోట్ల 662కోట్ల పెట్టుబడుల సమీకరణ జరిగింది.

## స్థిరంగా.. అల్పపీడనం! రాష్ట్రంపై ప్రభావం ఏ మేరకు ఉంటుందంటే..



అమరావతి/విశాఖపట్నం: మధ్య దక్షిణ బంగాళాఖాతంలో తూర్పు భూమధ్యరేఖ ప్రాంతానికి ఆనుకుని హిందూ మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది.ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశలో నెమ్మదిగా కదులుతూ శ్రీలంక తీరం వైపు వెళ్లే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది.దీని ప్రభావం రాష్ట్రంపై స్వల్పంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు రాయలసీమ, దక్షిణ కోస్తాలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంపైకి ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి.

## ఆ దౌర్భాగ్యం ఉంటే పదవిని తృణప్రాయంగా వదిలేస్తా: మంత్రి అంబటి



అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లా ప్యాకేజీ తీసుకునే సన్నాసి రాజకీయాలు నేను చేయను అంటూ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు మంజూరైన పరిహారంలో రూ.2లక్షలు తీసుకునే దౌర్భాగ్యం ఉంటే పదవిని తృణపాయంగా వదిలేస్తానని మంత్రి అంబటి స్పష్టం చేశారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం 12 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారికి ఒక్కొక్క కుటుంబానికి రూ.7 లక్షలు చొప్పున మొత్తం రూ. 84 లక్షలను ప్రభుత్వం పరిహారంగా చెల్లించాం. ఆగస్టు 20న మృతి చెందినవారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పిం చాం. ఇన్ని కార్యక్రమాలు చేస్తున్నా చంద్రబాబు జేబు పార్టీ నాపై ఆరోపణలు చేస్తే నేనెలా ఊరుకుంటా?. నాపై తప్పుడు ట్రోల్స్ చేస్తున్నారు. జనసేన అభిమాని చనిపోతే కనీసం పలకరించని కుసంస్కారం పవన్‌ది' అంటూ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు.

## చైనా సరిహద్దులో ప్రళయ్ క్షిపణిని మోహరించనున్న భారత్

చైనాతో కొనసాగుతున్న సరిహద్దు వివాదం మధ్య భారత సైన్యం వ్యూహాత్మక కార్యకలాపాల కోసం తొలిసారిగా బాలిస్టిక్ క్షిపణిని చేర్చబోతున్నది. ఎల్ఏసీపై ప్రళయ్ బాలిస్టిక్ క్షిపణిని మోహరించాలని సైన్యం నిర్ణయించినట్లు పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. ఈ క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల వరకు తన లక్ష్యాన్ని టార్గెట్ చేయగలదు. ఈ క్షిపణిని 2021 డిసెంబర్‌లో వరుసగా రెండు రోజుల్లో రెండుసార్లు విజయవంతంగా పరీక్షించారు. అప్పటి నుంచి భారత సైన్యం తన అమ్ములపొదిలో చేర్చుకునేందుకు ఆర్మీ ఎదురుచూస్తున్నది.భారత్-చైనా సరిహద్దుల్లో ప్రళయ్ క్షిపణిని మోహరించే ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే వారం జరగనున్న ఉన్నత స్థాయి సమావేశంలో దీనికి ఆమోదం లభించే అవకాశం ఉన్నది. మన త్రివిధ దళాలు ప్రస్తుతం రాకెట్ ఫోర్స్‌ను తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిస్థితిలో ప్రళయ్ క్షిపణిని సరిహద్దులో మోహరించడం త్వరలోనే సాధ్యం కానున్నది.

## ప్రైవేటీకరణ జాబితాలో 3 విమానాశ్రయాలు

### ఏపీలో విజయవాడ, తిరుపతి, రాజమండ్రి



దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తిరుపతి, రాజమండ్రి విమానాశ్రయాలు ప్రైవేటీకరణ జాబితాలో ఉన్నాయి.నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ కింద కేంద్ర ప్రభుత్వం 2022-25 మధ్యకాలంలో దేశంలోని 25 విమానాశ్రయాలను లీజుకు ఇవ్వాలని నిర్ణయించగా అందులో ఈ మూడూ చోటు సంపాదించుకున్నాయి. విమానాశ్రయాల ప్రైవేటీకరణపై సోమవారం రాజ్యసభలో కేరళ సీపీఎం సభ్యుడు ఎలమారం కరీం అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి వీకేసింగ్ ఇచ్చిన సమాధానం ద్వారా ఈ విషయం తెలిసింది. ఇప్పటి వరకు దేశంలోని 8 విమానాశ్రయాలను పీపీపీ విధానంలో లీజుకు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్మిస్తున్న భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు 2,203 ఎకరాలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,160.47 ఎకరాలు సేకరించినట్లు కేంద్ర మంత్రి వీకేసింగ్ తెలిపారు. రాజ్యసభలో తెదేపా, భాజపా సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్, జీవీఎల్ నరసింహారావులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ సమాధానమిచ్చారు. ఈ విమానాశ్రయ నిర్మాణానికి రూ.2,500 కోట్లు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. సవరించిన అంచనాలను ఏపీ ప్రభుత్వం, ప్రాజెక్టు అభివృద్ధిదారు కలిసి ఖరారు చేయాల్సి ఉందన్నారు. కన్సెషన్ అగ్రిమెంట్ ప్రకారం విమానాశ్రయం తొలి దశ పూర్తయితే ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల అవసరాలు తీర్చగలుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇచ్చిన స్థలానుమతి ప్రకారం ఈ విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత 30 ఏళ్లపాటు వైజాగ్ నావల్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాలు నడపకూడదన్నారు. ఆ తర్వాత ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అవసరాలకు తగ్గట్టు షెడ్యూల్డ్ విమానాలు నడుపుకోవచ్చని వివరించారు. 2022 శీతాకాల షెడ్యూల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని మూడు అంతర్జాతీయ విమానాశ్రయాల నుంచి 15 అంతర్జాతీయ విమానాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఉద్యోగుల వేతనాల పెంపు/ప్రోత్సాహాల అందజేతకు సంబంధించి ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రాజ్యసభలో సోమవారం వింత సమాధానం ఇచ్చారు. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్- విశాఖ ఉక్కు కర్మాగారం)లో ఏటా ఉద్యోగ విరమణలు జరుగుతున్నా ఆ ఖాళీలను భర్తీ చేయడం లేదని, ఉద్యోగోన్నతులు ఇవ్వడం లేదని భాజపా రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు ప్రశ్నించారు. స్పందించిన ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో ఖాళీల భర్తీ, ఉద్యోగోన్నతులు, ప్రోత్సాహకాలపై వివరణ ఇచ్చారు. జీవీఎల్ అనుబంధ ప్రశ్న సంధిస్తూ తాను విశాఖ ఉక్కుపై అడిగానన్నారు. స్పందించిన మంత్రి సెయిల్ పరిధిలో మూడేళ్ల లాభదాయకత నిబంధన ఉందని, అది విశాఖ ఉక్కుకు వర్తిస్తుందో లేదో పరిశీలించాలని సమాధానమిచ్చారు .మాండౌస్ తుపానుతో తీవ్రంగా నష్టపోయిన పొగాకు రైతులకు తగిన పరిహారం చెల్లించాలని కేంద్ర ప్రభుత్వానికి తెదేపా రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో ప్రత్యేక ప్రస్తావన కింద సోమవారం ఆయన మాట్లాడారు. దక్షిణ కోస్తాలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సుమారు 53 వేల హెక్టార్లలో రైతులు పొగాకు సాగు చేశారని ఆయన తెలిపారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఒక్కో హెక్టారుకు రూ.75 వేల నుంచి రూ.90 వేలు పెట్టుబడి పెట్టారని వివరించారు. తుపానుతో పంట తీవ్రంగా దెబ్బతినడంతో ఆర్థికంగా రైతులు కుదేలయ్యారని, వారిని ఆదుకోవాలని కోరారు.ప్రకాశం బ్యారేజీ వాటర్ ఏరోడ్రోమ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోనిదని, అక్కడ నుంచి సీ ప్లేన్ల రాకపోకల సాధ్యతపై ముందస్తు అధ్యయనం పూర్తయిందని కేంద్రమంత్రి వి.కె.సింగ్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఏపీలో సేవలందని మార్గాల్లో ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు ఏదైనా సంస్థ ఆసక్తి చూపితే మున్ముందు టెండర్ల ప్రక్రియలో పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 95.69 లక్షల గృహాలకుగానూ 64.07 లక్షల ఇళ్లకు (66.96 శాతం) జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తుండగా.. తెలంగాణలో 53.87 లక్షల ఇళ్లకుగానూ అన్నింటికీ (వంద శాతం) నీరిస్తున్నట్లు జల్‌శక్తి సహాయ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ తెలిపారు. రాజ్యసభ సభ్యులు సీఎం రమేశ్, పిల్లి సుభాష్‌చంద్రబోస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు.నేషనల్ రూరల్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎన్ఆర్‌బీఐ) కింద ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)లను సంఘటితం చేయడానికి రాష్ట్రాలు సుముఖత చూపలేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి భాగవత్ కరాడ్ తెలిపారు.

## నెల్లూరులో ఘోర రోడ్డు ప్రమాదం..

### నలుగురు కార్మికులు మృతి

నెల్లూరు: నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుంది. గుడ్లూరు మండలం మోచర్ల వద్ద జాతీయ రహదారి పనుల్లో నిమగ్నమైన కార్మికులపైకి లారీ దూసుకెళ్లింది.ఈ ప్రమాదం ఘటనా స్థలిలోనే ముగ్గురు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందగా మృతుల సంఖ్య అయిదుకి చేరింది. మిగతా వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం నెల్లూరు అసుపత్రికి తరలించారు.ఘటన జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్ రావు ప్రమాదాన్ని గమనించి ఆగిపోయారు. ప్రమాదంపై చలించిపోయిన ఎంపీ క్షతగాత్రులను తరలించే చర్యలు చేపట్టారు. యాక్సిడెంట్ జోన్‌గా ఉన్న మోచెర్ల వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని భరోసానిచ్చారు.



# సంపాదకీయం

బుధవారం 21-12-2022

## అప్పుల జాబితాలో తెలుగు రాష్ట్రాలు

దేశంలోని వివిధ రాష్ట్రాల అప్పుల వివరాలను కేంద్రం ప్రకటించింది. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్రం రాష్ట్రాల అప్పుల వివరాలు వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల్లో అప్పుల భారం పెరుగుతోందని కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పై అప్పుల భారం పెరుగుతున్నట్లు కేంద్రం చెప్పింది. 2018లో ఏపీ అప్పు రూ.2.29 లక్షల కోట్లు ఉండగా ప్రస్తుతం ఆ అప్పు రూ.3.98 లక్షల కోట్లకు చేరిందని కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. ఏపీ జీడీపీలో మూడేళ్లుగా అప్పుల శాతం పెరిగినట్టు చెప్పింది. 2014లో ఏపీ జీడీపీలో అప్పుల శాతం 42.3 శాతంగా ఉందని కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది. 2014 తర్వాత ఏపీ జీడీపీలో అప్పుల శాతం తగ్గిందని, 2015లో 23.3 శాతం అప్పులు ఉండగా 2021 నాటికి అది 36.5 శాతానికి పెరిగినట్టు కేంద్రం వెల్లడించింది. తెలంగాణలో కూడా అప్పుల భారం పెరుగుతోందని కేంద్రం తెలిపింది. 2018లో రూ.1.60 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర అప్పు 2022 నాటికి రూ.3.12 లక్షల కోట్లకు చేరుకుందని వెల్లడించింది. 2021-22 నాటికి అప్పులు 16.7 శాతంగా ఉన్నట్టు కేంద్రం చెప్పింది. తెలంగాణ జీఎస్డీపీలో గత మూడేళ్లుగా అప్పుల శాతం పెరిగాయని తెలిపింది. 2016లో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో అప్పుల శాతం 15.7 ఉండగా, ఆ తర్వాత భారీగా పెరుగుదల నమోదైనట్టు పేర్కొంది. 2022 నాటికి తెలంగాణ జీఎస్డీపీలో 27.4 శాతం అప్పులు నమోదు అయ్యాయని చెప్పింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే అప్పుల్లో తమిళనాడు నెంబర్ వన్‌గా ఉంది. 2022 నాటికి తమిళనాడు అప్పు రూ. 6,59,868 కోట్లుగా ఉందని కేంద్రం తెలిపింది. రెండో స్థానంలో ఉన్న ఉత్తరప్రదేశ్ కు రూ. 6,53,307 కోట్ల అప్పు ఉంది. మహారాష్ట్ర మూడో స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర అప్పు రూ. 6,08,999 కోట్లు, నాలుగో స్థానంలో ఉన్న పశ్చిమబెంగాల్ అప్పు రూ. 5,62, 697 కోట్లు అని తేలింది. ఐదో స్థానంలో రాజస్థాన్ అప్పు రూ. 4,77,177 కోట్లు, ఆరో స్థానంలో కర్ణాటక రూ.4,61,832 కోట్ల అప్పు ఉందని కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది. ఏడు స్థానంలో గుజరాత్ అప్పు రూ. 4,02,785 కోట్లుగా ఉందని చెప్పింది. విభజన చట్టంలోని హామీల మేరకు ఇప్పటి వరకూ ఏపీకి రూ.23,110.47 కోట్లు ఆర్థిక సాయం చేశామని కేంద్రం ప్రకటించింది. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఇటీవల అడిగిన ప్రశ్నకు కేంద్రం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. రెవెన్యూ లోటు భర్తీ కింద రూ.5617.89 కోట్లు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.1750 కోట్లు, రాజధాని నిర్మాణం కోసం రూ.2500 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ. 13,226.772 కోట్లు ఏపీకి ఇచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2015-20 మధ్య కాలంలో ఏపీ సంతకాలు చేసిన విదేశీ ప్రాజక్టులపై తీసుకున్న రుణాలకు రూ.15.81 కోట్ల వడ్డీ చెల్లింపులు కూడా విడుదల చేసినట్లు వెల్లడించారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద 2019-20 నుంచి 2022-23 మధ్య ఏపీకి రూ.4199.55 కోట్లు విడుదల చేశామన్నారు. ఏపీ రాజధాని నిర్మాణానికి రూ.2500 కోట్లు ఇచ్చామని రాజ్యసభలో కేంద్రం వెల్లడించింది. ఏపీకి నూతన రాజధాని నిర్మాణానికి నిధులు ఇచ్చామని పేర్కొంది. ఏపీ విభజన చట్టం హామీల అమలు, అందిస్తున్న సాయంపై ఎంపీ కనకమేడల అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి పంకజ్‌చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. విభజన చట్టంలోని నిబంధనలు, నీతి ఆయోగ్ సిఫార్సులతో ఏపీకి ఆర్థికసాయం అందిస్తున్నామని కేంద్రం వెల్లడించింది.

# పవన్ వ్యూహాం అదేనా



విజయవాడ, డిసెంబర్ 20,జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు ముఖ్యమంత్రిని కావాలని బలంగా కోరిక ఉంది. అయితే ఎలా? జనసేనకు ఎన్ని స్థానాలు వస్తే ఆయన సీఎం అవుతారు? కనీసం యాభై స్థానాల్లో గెలిస్తేనే ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలంటూ మిత్రపక్షం ముందు ప్రతిపాదన పెట్టొచ్చు. కానీ ఆ స్థాయిలో గెలవాలంటే పవన్ కల్యాణ్ ఏం చేయాలి? ఇప్పటిలా వీకెండ్ కు వచ్చి నాలుగు డైలాగులు కొట్టిపోతే జనం నమ్ముతారా? నేతలకే నమ్మకం కలిగించలేదని పవన్ ప్రజలను ఎలా నమ్మించగలుగుతారు? ఈ ప్రశ్నలన్నీ జనసేన నాయకుల నుంచి వస్తున్నవే. పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి రాజకీయాలు చేయాలని కోరుతున్నారు. పైగా పవన్ చేస్తున్న కామెంట్స్ కార్యకర్తలకు కూడా అర్థం కాకుండా ఉన్నాయి. వ్యూహం తనకు వదిలేయాలని, పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. వినటానికి బాగానే ఉంది కానీ, కార్యాచరణలో సాధ్యమైనా? ఒకవైపు వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చకుండా చూస్తానంటున్నారు. తనను సీఎం చేయడానికి జనం బలంగా కోరుకోవాలని అంటున్నారు. ఈ రెండింటికి ఎలా కుదురుతుంది? అన్న ప్రశ్నకు జనసైనికుల వద్ద సమాధానం దొరకడం లేదు. అంటే తెలుగుదేశం పార్టీతో కలసి పనిచేస్తానని ఆయన చెప్పకనే చెప్పినట్లయింది. మరి టీడీపీతో పొత్తుపెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగితే ఈయన ఎలా సీఎం అవుతారు? ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం కాకుండా జనసేనకు సీఎం పదవి ఎందుకు ఇస్తుంది? టీడీపీ, జనసేన కలసి పోటీ చేస్తే అత్యధికస్థానాల్లో టీడీపీయే పోటీ చేస్తుంది. ఇప్పుడున్న బలాల ప్రకారం టీడీపీయే ఎక్కువ స్థానాల్లో గెలుస్తుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. తక్కువ స్థానాలు గెలిచిన పవన్ ను పిలిచి మరీ ముఖ్యమంత్రి పదవి ఇచ్చేంత దయార్ద్ర హృదయం ఎవరిక ఉంటుంది? అందునా చంద్రబాబు లాంటి నేతలు పవన్ కు ఉదారంగా సీఎం సీటు ఇచ్చేసి తాను తప్పుకుంటారా? అంటే అంతకంటే వెర్రితనం మరొకటి ఉంటుందా? అన్న ప్రశ్న తలెత్తుంది. విడిగా పోటీ చేసి ఎవరికీ తగినంత మెజారిటీ రాకపోతే.. జనసేన కొన్ని స్థానాలు గెలిచి దాని మద్దతు అవసరమైతేనే అది సాధ్యమవుతుంది. కానీ ఏపీలో ఆ సీన్ ప్రస్తుతానికయితే లేదు. కర్ణాటకలో జేడీఎస్ మాదిరి అధికారంలోకి రావాలంటే తనంతట తానుగా విడిగా పోటీ చేయాలి. అంతేకాని పొత్తులు ముందే పెట్టుకుని పోటీ చేస్తే సీఎం పదవి పిలిచి ఇచ్చేంత సహృదయం రాజకీయాల్లో అసలు ఉండదు. మరి ముందుగానే పవన్ కల్యాణ్ టీడీపీతో ముఖ్యమంత్రి తనకే ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకుంటారా? లేక ఎక్కువ స్థానాల్లో గెలిచిన అనంతరం తనకు సీఎం పదవి ఇవ్వాలని పట్టుబడతారా? అన్నది తెలియాల్సి ఉంది. బహుశ అదే ఆయన వ్యూహమేమో? చూడాలి.

# హిట్ లిస్ట్ లో 70 మంది..

విజయవాడ, డిసెంబర్ 20, వైసీపీ అధినేత జగన్ రెండోసారి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఈసారి పక్కన పెట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అనేక సార్లు ఇప్పటి వరకూ సర్వేలు చేయించినా కొందరు ఎమ్మెల్యేలపై అసంతృప్తి మాత్రం ప్రజల్లో అలాగే ఉంది. వారి పనితీరు కూడా మెరుగుపడలేదు. తనకు ఇష్టమైన, క్లిష్టసమయంలో తన పక్కన ఉన్నవారిని సయితం ఆయన పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారు. కొందరిని నియోజకవర్గాలకు మారిస్తే ఎలా ఉంటుందని సర్వేలు చేయిస్తున్నారు. దాదాపు 70 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి జగన్ ఝలక్ ఇచ్చే అవకాశముంది. వీరిలో కొందరిని నియోజకవర్గాలను ఛేంజ్ చేయాలని చూస్తున్నారు. వర్గ విభేదాలతో పాటు ప్రజల్లో ఎమ్మెల్యేల పట్ల ఉన్న అసంతృప్తితో ఉన్న వారిని వచ్చే ఎన్నికలకు సైడ్ చేయాలని చూస్తున్నారు. కఠిన నిర్ణయాలు తీసుకోకుంటే అధికారం కోల్పోకతప్పదని నిర్ణయానికి వచ్చిన జగన్ వారికి ప్రత్యామ్నాయ నేతలను కూడా అన్వేషిస్తున్నారని తెలిసింది. ఏ అభ్యర్థి అయితే గెలుపు సాధ్యమవుతుందన్న దానిపై ప్రత్యేకంగా నియోజకవర్గాల వారీగా సర్వేలు కూడా చేయిస్తున్నారని తెలిసింది. ఐ ప్యాక్ టీంతో పాటు సొంత మీడియా నుంచి కూడా ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకుంటున్నారు. అందిన సమాచారం ప్రకారం ప్రకాశం జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చే అవకాశముందని తెలిసింది. కనిగిరి నుంచి బుర్రా మధుసూదన్ యాదవ్, దర్శి నుంచి మద్దిశెట్టి వేణుగోపాల్, గిద్దలూరు నుంచి అన్నా రాంబాబు, కొండపి నుంచి గత అభ్యర్థి కాకుండా కొత్త వ్యక్తిని, కందుకూరు నుంచి మహీధర్ రెడ్డిని మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే ఒంగోలు నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డిని తప్పించి మరో అనుకూలమైన నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారని పార్టీ వర్గాల నుంచి తెలుస్తోంది. అద్దంకిలో కూడా గత అభ్యర్థి కాకుండా కొత్త వారిని ఎంపిక చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. ఇక పక్కనే ఉన్న నెల్లూరు జిల్లా నుంచి కూడా దాదాపు ఐదు నియోజకవర్గాలలో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చే అవకాశముంది. నెల్లూరు పట్టణ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ కు ఈసారి టిక్కెట్ దక్కే అవకాశం లేదంటున్నారు. అలాగే ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని పక్కన పెట్టడం ఖాయమని చెబుతున్నారు. గూడురు ఎమ్మెల్యే వరప్రసాద్ కు టిక్కెట్ దక్కే ఛాన్సేలేదన్నది పార్టీ వర్గాల అభిప్రాయం. అలాగే వెంకటగిరి నుంచి ఆనం రామనారాయణరెడ్డిని తప్పించి ఆయన స్థానంలో నేదురుమిల్లి రామ్ కుమార్ రెడ్డికి టిక్కెట్ దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని కూడా తప్పిస్తారంటున్నారు. ఆయనను ఎంపీగా బరిలోకి దింపే అవకాశాలు లేకపోలేదు. ఇక ఉత్తరాంధ్ర, రాయలసీమ మాత్రమే కాకుండా గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ అనేక మందిని పక్కన పెట్టాలన్నదే పార్టీ హైకమాండ్ నిర్ణయంగా కనిపిస్తుంది. గత ఎన్నికల్లో తక్కువ ఓట్లతో ఓటమి పాలయిన వారిని కూడా పక్కన పెట్టే ఆలోచనలో జగన్ ఉన్నారు. ఈ ఏడాదిన్నరలో ప్రజల్లో అసంతృప్తి ఉన్న నేతలు పుంజుకోవడం కష్టమని భావించిన జగన్ పార్టీ అధికారంలోకి వస్తే వారికి మరో రకంగా పదవులు ఇచ్చే అవకాశముందన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. మరి ఇంతకీ వైసీపీలో అన్ లక్కీ ఎమ్మెల్యేలు ఎవరన్నది తెలిసిపోనుంది.

# రేషన్ బియ్యం దందా



నెల్లూరు, డిసెంబర్ 20, పేదల కోసం ఏపీ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సరుకులు పక్కదారి పడుతున్నాయి. పీడీఎస్ బియ్యం రవాణాపై ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించినప్పటికీ రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. దీంతో అక్రమార్కులు రేషన్ బియ్యంతో కాసులు వెనకేసుకుంటున్నారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు రైస్ మిల్లుల్లో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పేదల నుంచి సేకరిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని దళారులు రైస్ మిల్లులకు విక్రయిస్తున్నారు. ఇక్కడ నుంచి కాకినాడకు యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేయడం కామన్ అయిపోయిందని విమర్శలు ఉన్నాయి. సివిల్ సప్లై అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందాలు నామమాత్రంగా ఒకటి, రెండు చోట్ల లారీలను, ఆటోలను సీజ్ చేస్తున్నప్పటికి అక్రమార్కులు మాత్రం తమ పని తాము చేసుకుపోతున్నారు. తెల్ల కార్డు ఉన్న లబ్ధిదారులందరూ రేషన్ బియ్యాన్ని వినియోగించుకునే పరిస్థితులు ఇప్పుడు లేవని అంటున్నారు. ఇందుకు కారణాలు అనేకం. దీంతో రేషన్ కార్డుదారుల వద్ద రేషన్ బియ్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళుతున్న దళారులు ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. కిలో రూ.8 నుంచి రూ.10 చొప్పున చొప్పున కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని రైసు మిల్లర్లకు కిలో రూ.15 నుంచి 20 రూపాయలు చొప్పున తిరిగి విక్రయాలు చేస్తున్నారు. ఇలా సేకరించిన రైస్ ను అత్యంత రహస్యంగా దారి మళ్లిస్తున్నారు. ఈ అక్రమ రవాణా వ్యవహారంలో అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందా వెనక పౌరసరఫరాలశాఖ అధికారుల అండదండలతోనే జరుగుతున్నాయని చాలాసార్లు ప్రతిపక్ష పార్టీల నాయకులు బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. అంతే కాదు ఈ వ్యవహారంలో రాజకీయ పార్టీ నేతల హస్తం ఉందని విమర్శలు లేకపోలేదు. తాజాగా మంగళగిరిలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందా వెనక పౌరసరఫరాలశాఖ అధికారుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రైస్ మిల్లుల యజమానులు దళారుల ద్వారా తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయించి ఆపై తమ మిల్లు పేరుతో ఉన్న లేబుల్ బస్తాల్లో నింపి ఎఫ్‌సీఐకి ఇస్తున్నట్లు తెలుస్తోంది. రైస్ మిల్లుల యజమానులు రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కోట్లలో సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ దందాపై ఉక్కుపాదం మోపుతున్నామని పైకి చెబుతున్న పౌరసరఫరాల శాఖ అధికారులు లోపాయికారిగా అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సివిల్ సప్లై అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందాలు ఎన్నిసార్లు దాడులు చేసి రేషన్ బియ్యం రీసైక్లింగ్‌ను పట్టుకుంటున్నా దందా మాత్రం ఆగడం లేదు. తాజాగా ఆత్మకూరు గుంటూరు ఛానల్ వద్ద గల శంకర్ రైస్ మిల్లులో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు చేసి 432 క్వింటాళ్ల రీసైక్లింగ్ రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. దీంతో మిల్లర్ల దందా ఎంత భారీగా జరుగుతుందో మరోసారి బహిర్గతం అయ్యింది. నిత్యం ఈ తంతు జరుగుతున్నా సంబంధిత శాఖలకు మిల్లర్లు మామూళ్లు సమర్పించని సమయంలో విజిలెన్స్ అధికారులు చేత ఇలా దాడులు చేయిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. రేషన్ బియ్యం రీ సైక్లింగ్ చేస్తూ కోట్లాది రూపాయలను గడిస్తోన్న రైస్ మిల్లుల పై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ లు వ్యక్తం అవుతున్నాయి.

## కల్లాల్లోనే తడిసిపోయిన ధాన్యం

ఏలూరు, డిసెంబర్ 20, మాండూస్ తుఫాన్‌తో ధాన్యం కల్లాల్లో పూర్తిగా తడిసిపోయింది. పంట పొలాల్లోనే నాని పోవడంతో ధాన్యం మొలకెత్తింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతాంగం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తోంది. ప్రభుత్వం ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని, రైతులకు ఎటువంటి నష్టమూ లేకుండా చేస్తామని చెబుతున్నప్పటికీ ఆచరణలో క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీంతో ధాన్యం కొనుగోళ్లపై సందిగ్ధత నెలకొంది. తేమశాతం రైతాంగానికి సమస్యగా మారడంతో మిల్లర్లు తప్పనిసరిగా డ్రయ్యర్స్ వాడాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా 1500 మంది మిల్లర్లు ధాన్యం సేకరించేందుకు ముందుకు రాగా వీరిలో 1000 మిల్లర్ల వద్దే డ్రయ్యర్స్ అందుబాటులో ఉన్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన 500 మిల్లర్లు డ్రయ్యర్స్ కొనుగోలు చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. గత ఏడాది రబీలో సేకరించిన ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం నేటికీ సుమారు రూ.1200 కోట్ల వరకు మిల్లర్లకు బకాయిలు పెండింగ్‌లో ఉండగా, తాజాగా రూ.200 కోట్ల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేయగా మరో వెయ్యి కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో పాత బకాయిలు పూర్తిగా చెల్లింపులు కాక ఇబ్బందులు పడుతుంటే తాజాగా డ్రయ్యర్స్ కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించడం తమకు తలకు మించిన భారంగా మారిందనే అభిప్రాయం రైస్ మిల్లర్స్ యజమానులు వ్యక్తం చేస్తున్నారు

# తిరుపతి నుంచి విశాల్ పోటీ



తిరుపతి, డిసెంబర్ 20, ఏపీ సీఎం వైయస్ జగన్ అంటే తనకు చాలా ఇష్టమని ఐ లవ్ జగన్ అని హీరో విశాల్ అన్నారు. లాఠీ సినిమా ప్రమోషన్ లో భాగంగా తిరుపతి వచ్చిన విశాల్ తాను కుప్పం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానన్న ప్రచారాన్ని ఖండించారు. తన తండ్రి కుప్పంలో వ్యాపారం చేసే వారిని సినిమాల్లోకి రాక ముందు తండ్రికి సాయంగా కుప్పంలోనే ఉండేవాడినని తెలిపారు. కుప్పంలో ప్రతి వీధి తనకు బాగా తెలుసని అన్నారు. తనకు ఒక ఎమ్మెల్యే కన్నా ఎక్కువ సంపాదన, ఎక్కువ ప్రజాభిమానం ఉందని అన్నారు. తాను ఏపీ రాజకీయాల్లోకి రానని స్పష్టం చేశారు. లాఠీ సినిమా ప్రతి టికెట్ ఆదాయంలో ఒక రూపాయి పక్కన పెట్టి రైతులకు సాయం చేస్తానని తెలిపారు. సోషల్ సర్వీస్ చేసే ప్రతి వ్యక్తి రాజకీయ నాయకుడేనని, అలా తాను ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. నటుడు కాక ముందు కుప్పంలో పనిచేశాను. మా నాన్న కాంట్రాక్టర్ గా ఉన్నప్పుడు కుప్పంలో ప్రతి వీధి తిరిగాను. నేను కుప్పం నుంచి ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. రాజకీయాలంటే సోషల్ సర్వీస్ అన్నారు. అందరం పొలిటీషియన్సే అన్నారు. సాయం చేసే ప్రతీ వ్యక్తి పొలిటీషియన్స్ అన్నారు. లాఠీ సినిమా ద్వారా వచ్చిన ఆదాయంలో టికెట్ పై ఒక రూపాయి రైతులకు సాయం చేస్తాను. ఈ సినిమాను అందరి కానిస్టేబుల్ కుటుంబాలకు చూపించాలని కోరిక. ఐ లవ్ జగన్. భవిష్యత్ లో ఏపీ నుంచి పోటీ చేయనన్నారు. పోటీ అంటే హీరోలతోనే అన్నారు. అందరూ మెచ్చుకునే సినీ పరిశ్రమలో ఉన్నాను. ఇంతటి అభిమానాన్ని నేను కోల్పోలేను. ఎమ్మెల్యే కన్నా ఎక్కువ అభిమానాన్ని నేను సంపాధించుకున్నాను." - హీరో విశాల్ తమిళంలో హీరోగా నిలదొక్కుకున్న తెలుగు కుటుంబానికి చెందిన విశాల్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి వస్తున్నారని, కుప్పం నుంచి చంద్రబాబుపై పోటీ చేస్తారన్న ప్రచారం ఇటీవల జోరుగా సాగింది. ఈ ప్రచారాన్ని విశాల్ గతంలో కూడా ఖండించారు. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదన్నారు. ఈ విషయంలో తనను ఎవరూ సంప్రదించలేదని, అయినా ఈ వార్తలు ఎక్కడి నుంచి వచ్చాయెా తనకు తెలియదన్నారు. తన ప్రాధాన్యం సినిమాలకు మాత్రమేనన్నారు. ఏపీ రాజకీయాల్లోకి వచ్చి చంద్రబాబుపై పోటీ చేసే ఉద్దేశంలేదన్నారు. నెల్లూరుకు చెందిన విశాల్ రెడ్డి కుటుంబం చెన్నైలో స్థిరపడింది. ఆ కుటుంబానికి వైసీపీ నేతలతో సత్సంబంధాలు ఉన్నాయి. అయితే కుప్పం వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా భరతే ఉంటారని ఇప్పటికే సీఎం జగన్ ప్రకటించారు. బీసీలు అత్యధికంగా ఉన్న కుప్పం నుంచి బీసీ వర్గానికి చెందిన చంద్రమోళిని ప్రోత్సాహించామని జగన్ తెలిపారు. ఆయన చనిపోవడంతో చంద్రమోళి కుమారుడు భరత్ ప్రోత్సహిస్తున్నానన్నారు. భరత్‌ను గెలుపించుకు వస్తే మంత్రిని కుప్పానికి ఇస్తానన్నారు.

# క్యాసినో దందా 500 కోట్లపైనే

విజయవాడ, డిసెంబర్ 20, ఏపీలోని గుడివాడ క్యాసినో ఆరోపణలకు సంబంధించిన వివరాలను టీడీపీ నేతలు ఐటీ శాఖ అధికారులకు అందజేశారు. మాజీ మంత్రి కొడాలి నాని, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నేతృత్వంలో క్యాసినో నిర్వహించారంటూ టీడీపీ గతంలో ఫిర్యాదులు చేసిన విషయం అందరికీ తెలిసిందే. వాటికి సంబంధించిన వివరాలు అందించాలని వర్ల రామయ్యను ఆధాయ పన్ను శాఖ కోరింది. ఈ క్రమంలోనే ఆ వివరాలను అందించేందుకు వర్ల రామయ్య, బొండా ఉమ, కొనకళ్ల నారాయణ, రావి వెంకటేశ్వర రావు.. విజయవాడలోని ఐటీ కార్యాలయానికి వెళ్లారు. ఎడ్ల పందాలు పెడుతున్నామని పైకి చెప్తూ వెనక క్యాసినో నడిపారని వర్ల రామయ్య ఆరోపించారు. గుడివాడలో క్యాసినో నిర్వహిస్తున్నామని చికోటి ప్రవీణ్ ప్రచారం చేసిన ఆధారాలను ఐటీ అధికారులకు అందించామని చెప్పారు. చికోటి ప్రవీణ్ తనకు స్నేహితుడేనని వంశీ స్వయంగా చెప్పినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలోకి కొడాలి నాని వేలాది మందిని రప్పించారని మండిపడ్డారు. వేలకు వేలు ఎంట్రీ ఫీజులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడివాడ క్యాసినోలో దాదాపు 500 కోట్ల మేరకు ఆర్థిక లావాదేవీలు జరిగాయని అన్నారు. హవాలా రూపంలో ఆ నగదును దారి మళ్లించి ఉండవచ్చని కూడా అభిప్రాయం వ్యక్తం చేశారు. హవాలా డబ్బును దారి మళ్లించడంలో చికోటి సాయ పడ్డారని అన్నారు. ఇందులో ఎంత మొత్తం చేతులు మారాయనే వివరాలను తాము ఐటీకి ఇచ్చినట్లు చెప్పారు.

అలాగే క్యాసినో గురించి రాష్ట్ర అధికారులు ఎరూ పట్టించుకోలేదని అన్నారు. అందుకే కేంద్ర సంస్థలకు ఫిర్యాదు చేశామని వర్ల రామయ్య స్పష్టం చేశారు. గుడివాడలో సంక్రాంతి వేడుకల సందర్భంగా కొడాలి నానికి చెందిన కే కన్వెన్షన్ సెంటర్ లో క్యాసినో తో పాటు పేకాట లాంటి జూదాలతో పాటు చీర్ గర్ల్స్ తో అసభ్య నృత్యాలు నిర్వహించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. అందుకు సంబంధించిన పలు వీడియోలను, ఫొటోలను అప్పట్లో తెలుగుదేశం నేతలు మీడియాకు విడుదల చేశారు. నిజనిజాలను నిగ్గుతేల్చేందుకు ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు తన పార్టీ సీనియర్ నేత వర్ల రామయ్య నేతృత్వంలో నిజనిర్ధారణ కమిటీ నియమించారు. ఆ తర్వాత వర్ల రామయ్య తాము సేకరించిన ఆధారాలతో కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేశారు. అప్పటి మంత్రి కోడాలి నాని ఆధ్వర్యంలోనే ఈ క్యాసినో జరిగిందని అని అన్నారు. ఈ అంశంలో కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, రెవిన్యూ ఇంటెలిజెన్స్, ఐటీ విభాగాలు రంగంలో దిగి నిజాలను నిగ్గు తేల్చాలని కోరారు. జాతీయ స్థాయిలో పోరాడుతామని చెప్పారు. మూడు రోజుల్లో క్యాసినో ద్వారా రూ. 250 నుంచి 500 కోట్ల వరకు లావాదేవీలు జరిగాయని వర్ల రామయ్య ఆరోపిస్తున్నారు. మొత్తం 13 మంది చీర్ గర్ల్స్ ఇండిగో విమానంలో ప్రయాణం చేశారని వెల్లడించారు. గన్నవరం ? బెంగళూరు. బెంగళూరు ? గోవా, గోవా ? విజయవాడ ప్రయాణీకుల వివరాలను మీడియా ముందు ఉంచారు. వీటిని దర్యాప్తు సంస్థలకు కూడా ఇచ్చారు. క్యాసినో పాల్గొనే వారి నుండి రూ.50వేల వరకూ వసూలు చేశారనీ, ఆ ప్యాకేజీలో భాగంగా లాడ్జి వసతి, ట్రాన్స్ పోర్టు, ఎంట్రీ ఫీజు అన్ని ఉచితమని వర్ల రామయ్య సాక్ష్యాలు చూపించారు.

## పునాదుల్లో గృహప్రవేశాలు

విజయనగరం, డిసెంబర్ 20,జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గృహ ప్రవేశాలు పండగలా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చాలా వరకు నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. మరికొన్ని చోట్ల అసలు లే అవుట్లకు రహదారులు గాని, విద్యుత్తు సదుపాయం గాని లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావడం లేదు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతంది. విజయనగరం జిల్లాలో 78,158 ఇళ్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 25, 968 ఇళ్లు మంజూరయ్యాయి. నేటివరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 5018, విజయనగరం జిల్లాలో 7,457 మంది లబ్ధిదారులు ఇంతవరకు పునాదులు కూడా తీయలేదు. కొన్ని ఇళ్లు పునాదులు, మరికొన్ని లింటల్ లెవెల్‌లో నిలిచిపోయాయి. ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు ఇళ్ల నిర్మాణాలకు సరిపోకపోవడం, కాలనీల్లో సౌకర్యాలు లేకపోవడం, పలుచోట్ల గ్రామాలకు, పట్టణాలకు దూరంగా ఉండడం వల్ల లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. ఈనేపథ్యంలో అధికారులు ప్రారంభించని ఇళ్ల స్థలాలను రద్దు చేస్తామని హెచ్చరించినప్పటికీ లబ్ధిదారులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు.జిల్లా కేంద్రమైన పార్వతీపురం మున్సిపాల్టీలో 24 జగనన్న లేఅవుట్లు వేయగా, ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులెవరూ ముందుకు రాకపోవడంతో అందులో 8 లేఅవుట్లను రద్దు చేశారు. మిగిలిన 17 జగనన్న లేఅవుట్లు అక్కడక్కడా పనులు జరుగుతున్నాయి. ఈ 17 లేఅవుట్లలో 1897మంది లబ్ధిదారులకు స్థలాలను కేటాయించారు. వీరిలో ఇప్పటి వరకూ కేవలం 14మందే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. 778మంది మాత్రమే పనులు ప్రారంభించారు. అవి కూడా పునాదులతో నిలిచిపోయారు. మరో 694మంది పునాదుల నిర్మాణాలను పూర్తి చేశారు. 55మంది లబ్ధిదారులు శ్లాబ్‌లెవెల్ వరకూ గోడల నిర్మించి వదిలేశారు. మరో 45మంది లబ్ధిదారులు శ్లాబులు వేశారు. అయితే ప్రభుత్వం నిర్దేశించి ఈనెల 21న గృహప్రవేశాలకు కేవలం 14 ఇళ్లు మాత్రమే సిద్ధంగా ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలకు జాప్యానికి ప్రధాన కారణం పెరుగుతున్న ఇళ్ల సామాగ్రి ధరలతో పాటు లేఅవుట్లలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో మరో కారణం. అంతేకాక ప్రభుత్వం అందించే అరకొరసాయం ఎందుకూ సరిపడడంలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 38 పంచాయితీల్లో 19 లేఔట్లుగా ఏర్పాటు చేసి 1004 మందికి జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇందులో ఇప్పటి వరకూ ఆడారు, నర్సిపురం 2, వందువలో ఒక ఇల్లు నిర్మాణం ప్రారంభమయ్యాయి. సాక్ష్యాత్తు నియోజకవర్గ ఎమ్మెల్యే స్వగ్రామమైన వందవలో 64 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభం కాలేదు. పిఎంజిఆర్ కిందన మంజూరై ఇళ్లలో ఒకే ఒక ఇంటికి భూమి పూజ అయ్యింది. అలాగే మండలంలో పిఎంఎవైజి పథకం కింద 368 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 210 మంది లబ్ధిదారులకు కేవలం రూ.5వేలు చొప్పున ఖాతాలో జమ అయ్యాయి.

## పీఆర్పీ నేతలకు జనసేనాని గాలం

రాజమండ్రి, డిసెంబర్ 20, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాపై జనసేన ప్రత్యేక ఫోకస్ పెట్టిందట. ఇప్పటివరకు పార్టీ ప్లస్ లు మైనస్ లు అంచనాలు వేసుకున్న నేతలు ఇప్పుడు కొత్త పల్లవి అందుకున్నారట. 2009 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఓట్లు సీట్లలో పీఆర్పీ ఉనికి చాటుకుంది. మొత్తం 19 స్థానాలుగాను నాలుగుచోట్ల గెలవగా, 8 చోట్ల రెండో స్థానంలో నిలిచింది. 5 చోట్ల చెప్పుకోదగ్గ స్థాయిలో ఓట్లు చీల్చింది ప్రజారాజ్యంపార్టీ. గత ఎన్నికల్లో దాదాపు అన్ని స్థానాలులో పోటీ చేసినప్పటికీ జనసేన ఒక్కచోటే గెలిచింది. 2019లో వచ్చిన ఓట్లను దగ్గర పెట్టుకుని కొత్త సమీకరణాలతో గ్లాసు పార్టీ పెద్దలు కుస్తీ పడుతున్నారట. అప్పట్లో పీఆర్పీలో యాక్టివ్‌గా పనిచేసి ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్న నేతల గురించి ఆరా తీస్తున్నారట. వారికి రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం ఉందా? జనసేనపై వారి అభిప్రాయం ఏంటని తెలుసుకునే పనిలో పడ్డారట. 2009లో పీఆర్పీ నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో ఇద్దరు ముగ్గురు తప్ప అందరూ కొత్తవారే. ఎన్నికల బరిలో తొలిసారి నిలిచిన వారే. అయినప్పటికీ వారికి అప్పట్లో ఆస్థాయిలో ఓట్లు ఎలా వచ్చాయి? పార్టీ మైలేజ్ ఎంత? ఓన్ వోట్ షేరింగ్ ఏముంది అనే సమాచారం తెలుసుకునే పనిలో ఉన్నారట జనసేన నాయకులు.గతంలో ప్రజారాజ్యంలో పనిచేసిన వాళ్లలో ప్రస్తుతం వైసీపీలో కొందరు ప్రజాప్రతినిధులుగా ఉన్నారు. మరికొందరు ప్రతిపక్షంలో నియోజకవర్గ కోఆర్డినేటర్లుగా పాలిటిక్స్ చేస్తున్నారు. అయితే పూర్తిగా పాలిటిక్స్‌కి దూరమైన వాళ్ళు ఎవరున్నారు? వారి ఉద్దేశం ఏంటో తెలుసుకుంటున్నారట. ఎప్పుడో అవుట్ డేటెడ్ నేతలు ఇప్పుడు వచ్చి ఏం చేస్తారని కొందరు అంటుంటే.. అదనపు బలం వస్తుంది కదా అని మరికొందరు వాదిస్తున్నారట. సామాజిక వర్గాల వారీగా పలానా నేత పలానా వారి దగ్గరికి వెళ్లి ప్రతిపాదన పెట్టాలని జనసేన నుంచి పార్టీ నేతలకు ఆదేశాలు వెళ్లాయట. గతంలో పీఆర్పీలో పెద్దాపురం ఎమ్మెల్యేగా పనిచేసిన పంతం గాంధీ మోహన్ తర్వాత వైసీపీలో చేరినా సైలెంట్ అయ్యారు. వి గన్నవరంలో పోటీ చేసి ఓడిన జంగా గౌతమ్ కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. అటువంటి వారిపైనా దృష్టిపెట్టారట.జిల్లా, రాష్ట్ర స్థాయిలో పీఆర్పీ తరపున పని చేసిన వారిని తిరిగి యాక్టివ్ కావాలని కోరుతున్నారట జనసేన నాయకులు. ప్రస్తుతం సీటు మీద ఆశలు పెట్టుకున్న నేతలకు పొత్తుల్లో తమ ప్లేసు ఎక్కడ పోతుందోనన్న భయం నెలకొంది. ఇదే సమయంలో కొత్తవారు వస్తే కష్టమేనని ఆందోళన చెందుతున్నారట. అయితే పార్టీ స్ట్రాంగ్ గా ఉంటే అందరికీ అవకాశాలు వస్తాయని.. దానికి తగ్గట్లుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జనసేన పెద్దల నుంచి వర్తమానం అందిందట. గెలుపోటములను డిసైడ్ చేసే వారూ ఉంటే కచ్చితంగా వారిని చేరదీయాలని స్పష్టం చేస్తున్నారట. మొత్తానికి అన్నయ్య సెలెక్ట్ చేసిన అభ్యర్థులు.. నేతలపై తమ్ముడు ఫోకస్ పెట్టారు. మరి ఈ కూడికలు తీసివేతలు ఫార్ములా ఏ మేరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

## రెండు లారీలు ఢీ..డ్రైవర్లు క్షేమం

నెల్లూరు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డి పాలెం గ్రామం వద్ద ముంబై జాతీయ రహదారిపై తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొ?నాయి. అయితే, డ్రైవర్ లకు ప్రాణాపాయం తప్పింది. నెల్లూరు నుంచి బుచ్చివైపు వెళుతున్న ట్రాన్స్పోర్ట్ లారీ బుచ్చి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న సిమెంట్ మిక్సర్ లారీ వన్ వే లో వచ్చి ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదం లో క్యాబిన్ లో చిక్కుకున్న డ్రైవర్ను స్థానికులు పోలీసుల సహాయంతో బయటకు తీశారు. చికిత్స నిమిత్తం 108 లో ఆసుపత్రికి తరలించారు. ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు

## సంక్రాంతి బస్సులకు ఏపీఎస్ఆర్టీసీ ఆఫర్..

సంక్రాంతి పండుగ రద్దీని తట్టుకునేందుకు ఏపీఎస్ ఆర్టీసీ 6,400 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. అయితే, ఈసారి ఈ స్పెషల్ బస్సుల్లో 'అదనపు' బాదుడుకు స్వస్తి పలికిన అధికారులు.. ప్రత్యేక రాయితీ కూడా కల్పించారు. జనవరి 6వ తేదీ నుంచి 14 వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. అలాగే, పండుగ రద్దీని బట్టి 15 నుంచి 18 వరకు ఆయా బస్ డిపోల నుంచి బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ఇక రానుపోను టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు 10 శాతం రాయితీ ప్రకటించారు. క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల కోసం ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. పొరుగు, ఇతర రాష్ట్రాల నుంచి సంక్రాంతికి వచ్చే వారు ఎక్కువగా ఉంటారు కాబట్టి పండుగ ముందు 3,120 బస్సులు, పండుగ తర్వాత 3,280 బస్సులు సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. బస్సు బయలుదేరిన తర్వాత కూడా అందుబాటులో ఉన్న సీట్లను బట్టి యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఆర్టీసీని

### రానుపోను టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ
### సంక్రాంతిని పురస్కరించుకుని 6,400 ప్రత్యేక బస్సులు
### అదనపు బాదుడుకు స్వస్తి పలికిన ఏపీఎస్ ఆర్టీసీ
### గణనీయంగా పెరిగిన ఆర్టీసీ ఆదాయం

ఆదరించే ప్రయాణికుల సంఖ్య 63 శాతం నుంచి 68 శాతానికి పెరిగినట్టు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. గతేడాది నవంబరు నాటికి రూ. 2,623 కోట్ల ఆదాయం రాగా, ఈసారి అది రూ. 3,866 కోట్లకు పెరిగినట్టు చెప్పారు. కార్గో ఆదాయంలోనూ భారీ పెరుగుదల కనిపించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 122 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది ఇంకా మరో మూడు నెలలు మిగిలి ఉండగానే ఆదాయం రూ. 119 కోట్లు దాటేసింది.

## సీఐటీయూ 9వ మహాసభలకు విరాళాలు ఇవ్వండి




### నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి. చంద్రారెడ్డి, పి. వెంకటసుబ్బయ్య

కడప దేశవ్యాప్తంగా ఉద్యోగ కార్మిక వర్గాలకు వారి పోరాటాలకు అండగా నిలుస్తున్న సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సిఐటియు 9వ కడప జిల్లా మహాసభలు ఈనెల 29 30వ తేదీలలో రెండు రోజుల పాటు కడప నగరంలో జరుగుతున్నాయని ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే గఫూర్ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాల కాశి హాజరవుతున్నారు. ఈ మహాసభలో జయప్రదానికి కార్మిక ఉద్యోగ వర్గాలు పట్టణ ప్రముఖులు ప్రజలు విద్యా వైద్య వ్యాపార సంస్థలు విరివిగా ఆర్థిక సహకారం అందించాలని సిఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి చంద్రారెడ్డి పి వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీచట్టానికి తూట్లు పొడుస్తోంది. కార్మికుల అశేష త్యాగాలతో,పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలనుపెట్టుబడిదారులకు అనుగుణంగా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి కుమ్మకై సవరణలుచేశాయి. ఫలితంగా 44 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు సివిల్ కోడ్స్ గా మార్చడం వలనకార్మికవర్గం బ్రిటీష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కోల్పోతున్నాయి.కార్పోరేట్లు ప్రభుత్వాన్ని శాసిస్తుండడంతో కార్మికుల కష్టాలు మరింత పెరుగుతున్నాయి.సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూపెట్టుబడిదారులకు సబ్సిడీ రుణాలివ్వడం, మరుసటి సంవత్సరం ఆ రుణాలను రద్దుచేస్తున్నాయి.ఈ ప్రభుత్వ విధానాల వల్ల దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ తోపాటునిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ వలన పేద, మధ్యతరగతిపిల్లలు చదువుకు దూరమవుతున్నారు. వైద్యం పేదలకు అందని ద్రాక్షలాగా వున్నది. కరోనానుండి ప్రజలను రక్షించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలుఅందిస్తున్నామని, మరోవైపు అనేక భారాలు మోపుతోంది.కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాగేసుకునేవిధంగా ప్రభుత్వ తీరువున్నది. అమాంతంగా ట్రూఆఫ్ చార్జీల పేరుతో కరెంటురేట్లను పెంచుతూ వుంది. ఇసుక ధరను అమాంతంగా పెంచిసామాన్యుల సొంత ఇల్లుచిరకాల కలను దూరంచేసింది.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేవు. 8ఏళ్ళుగా వేజోర్డు నియమించకపోవడంతో రాష్ట్రంలో షెడ్యూల్‌ఎంప్లాయిమెంట్లో వున్న వివిధ రకాలకార్మికులకు కనీస వేతనాలు లేవు. కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్‌ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పారు. కానీ చేయలేదు. మెరుగైన పిఆర్సి ఇస్తామని రివర్సుఆర్సిని ఇచ్చింది. సిపిఎస్ ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఇప్పుడు సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అంటూ ఉద్యోగులను మోసగించింది. వీటిని ప్రశ్నించిన ఉద్యోగులనుబెదిరింపులతో ఉక్కుపాదంతో అణచివేస్తున్నది. రాజ్యాంగానికి భిన్నంగా ఉద్యోగ, కార్మిక ఉద్యమాలపైనిర్బంధం ప్రయోగించి కార్మికుల హక్కులను కాలరాస్తున్నది.నగరంలో ప్రజలు, కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సిఐటియు నిర్వహిస్తోంది.సిఐటియు బలోపేతం అయితేనే కార్మిక ఉద్యోగ విధానాల్లో మార్పు వస్తుందని కార్మిక చట్టాలరక్షణ సాధ్యమన్న విషయాన్ని గుర్తించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాయడమే కాక మధ్య యుగాల దోపిడీపద్ధతులను మనపై రుద్దడానికి సిద్ధంగా వున్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఈ తొమ్మిదవ జిల్లా మహాసభలో చర్చించే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి కడప నగరం వేదిక కాబోతుందని వారు తెలిపారు

## కువైట్ కమిటీ సభ్యుల సేవలు అభినందనీయం: మేడపాటి వెంకట్



కడప అర్బన్ డిసెంబర్ 20: అన్నమయ్య జిల్లా ఓబులవారి పల్లి మండలం మంగంపేటకు చెందిన పెంచలమ్మ అనే మహిళ జీవనోపాధి కోసం కువైట్ కు వెళ్లి ప్రమాద వశాత్తూ క్రింద పడి చేయి విరిగి పోయి, తనకు నా అనే వారు ఎవ్వరు లేక తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు ఇబ్బందిపడుతూ కువైట్ వై.యస్.ఆర్. సిపి కన్వీనర్ ముమ్మిడి బాలి రెడ్డిని కలిసి నన్ను స్వదేశానికి పంపమని అభ్యర్ధించింది. మానవ దృగ్బంధంతో బాలిరెడ్డి పెంచలమ్మను స్వదేశం వెళ్ళేంతవరకు ఉండేందుకు భోజన వసతి కల్పించినారు. ఏపీ ఎన్ ఆర్ టి ఎస్ రీజినల్ కో-ఆర్డినేటర్ నాయని మహేష్ రెడ్డి వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు యం. చంద్రఖేఖర్ రెడ్డి, పి. సురేష్ కుమార్ రెడ్డి, ఏ. సుబ్బారెడ్డి, శివశంకర్ రెడ్డి, హనుమంతు రెడ్డి, మణి, వారి ఆర్థిక సహాయంతో టికెట్ డబ్బులు మరియు దారి ఖర్చులకు సుమారు 20వేల రూపాయలు ఇచ్చారు. ఈనెల 18 వ తేదీన జజీరా ఎయిర్ వేస్ బయలు దేరి 19న సురక్షితముగా స్వగృహానికి చేరింది.ఈసందర్భముగా ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ చైర్మన్ మేడపాటి వెంకట్, డైరెక్టర్ ఇలియాస్ మాట్లాడుతూ కువైట్ ఏపీ ఎన్ ఆర్ టి ఎస్ వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ కువైట్ కమిటీ సభ్యుల సేవలు అభినందనీయమని ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి మార్గదర్శకత్వంలో అనునిత్యంప్రవాసాంధ్రుల సంక్షేమం వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని తెలుపుతూ అను నిత్యం కువైట్ లో తెలుగు వారికీ అండగా ఉంటున్న ముమ్మడి బాలిరెడ్డి కి,నాయని మహేశ్వర్ రెడ్డి కి కువైట్ ఏపీఎన్ఆర్టిఎస్ సభ్యులు పార్టీ సభ్యులను అభినందించారుపెంచలమ్మ మాట్లాడుతూ వైఎస్సార్సీపీ కువైట్ కమిటీ కన్వీనర్ బాలిరెడ్డి కి, కమిటీ సభ్యులకు,నాయని మహేశ్వర రెడ్డి కి,ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి కి, ఏపీ ఎన్ ఆర్ టి ఎస్ చైర్మన్ మెడపాటి వెంకట్ కి, సీఈఓ దినేష్ కుమార్ కి,డైరెక్టర్ బి హెచ్ ఇలియాస్ కి, ధన్యవాదాలు తెలియచేసినారు

## పోలీస్ ఉద్యోగాల వయోపరిమితిపై సియం వైఎస్ జగన్ స్పందించాలి




### ప్రస్తుత పోలీస్ నోటిఫికేషన్ వలన యువత అన్యాయం.

కడప రూరల్ డిసెంబర్ 20 )పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ అభ్యర్థుల వయోపరిమితి,పరీక్షల తేదీలలో తీవ్ర అన్యాయం జరుగుతుందని తక్షణం ముఖ్యమంత్రి స్పందించి న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. దస్తగిరి డిమాండ్ చేశారు. మంగళ వారం కడప ఐటిఐ సర్కిల్ గాంధీ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ ఆందోళన చేయడం చేయడం జరిగినది అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించడం జరిగినది అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో విడుదల చేసిన నోటిఫికేషన్ లో మార్పులు చేయాలని ఇరవై రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న రాష్ట్ర స్పందించడం లేదని అందులో భాగంగా ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలచేయక నాలుగు సం.లు అయ్యిందని, అభ్యర్థులు అప్పటి నుండి ఎదురు చూస్తూ శిక్షణ తీసుకుంటున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్ లో వయోపరిమితి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి 24 సం.లు,ఎస్ఐ ఉద్యోగానికి 27 సం.లు ఇచ్చారని, దీని వలన అభ్యర్థులు వయస్సు రీత్యా అర్హత కోల్పోతారని, తక్షణం ప్రభుత్వం స్పందించి కానిస్టేబుల్ ఉద్యోగానికి 27 సం.లు , ఎస్ఐ ఉద్యోగానికి 30 సం.లు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పరీక్షల గడువు తక్కువ ఇవ్వడం జరిగిందని, తక్షణం మూడు నెలల గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఉదయమాలు తీవ్ర తరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ కార్యదర్శి చైతన్య, నాగార్జున, రామచంద్ర, రమేష్ పాల్గొన్నారు.

### సీఎం జగన్ పుట్టినరోజునేపథ్యంలో పలుసేవా కార్యక్రమాలు

విశాఖపట్నం ఏపీ సిఎం,వైసీపీ అధినేత జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా వైసీపీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాల ను నిర్వహించారు.దీంట్లో బాగంగా విశాఖలో వైసీపీ నాయకులు,కార్య కర్తలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ భాధ్యతగా ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిస్తూ నగరంలో మొక్కలు నాటి శ్రమదానం చేశారు.ఈ కార్యక్రమంలో నగర మేయ ర్ హరివెంకట కుమారి,వైసీపీ నేత కేకే రాజు పాల్గోని మొక్కలు నాటారు.మే యర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో నూ, ప్రభుత్వ కార్యాలయాల, ఖాళీ స్థలాల్లోనూ, పాఠశాల ఆవరణలోని మొక్క నాటాలని ఆమె పిలుపునిచ్చా రు.ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పుట్టి నరోజు సందర్భంగా పరిరక్షణకు ప్రారం భించిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిరంతరం ఒక ఉద్యమంలా చేపట్టాలని కొనియాడారు.

## వివాహిత మృతదేహానికి పోస్టు మార్టెం

### రెండేళ్ల తరువాత కోర్టు ఆదేశం

గన్నవరం కృష్ణాజిల్లా గన్నవరంలో రెండు ఏళ్ళ క్రితం చనిపోయిన సఫియాబేగం అనే వివాహిత మృతదేహానికి రీపోస్టుమార్టం చేసారు. గన్నవరంకు చెందిన సఫీయాబేగంకు 2015లో విజయవాడకు చెందిన సలిముల్లా షరీఫ్ తో వివాహం జరిగింది. గుంటూరులోని ఓ బ్యాంక్ లో క్యాషియర్ గా పనిచేస్తున్న సఫీయాబేగం రెండేళ్ల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సఫీయాబేగం మృతి పై భర్త, అత్త మామల పై అనుమానంతో గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లోబంధువులుఫిర్యాదు చేసారు. ముస్లింలు కావడంతో అప్పట్లో పోస్టుమార్టం నిర్వహించలేదని సమాచారం. అనుమానాస్పద కేసులో కోర్టు తీర్పులో పోస్టుమార్టంకు ఆదేశించింది. దాంతో గుంటూరు పోలీసులు, గన్నవరం రెవిన్యూ అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. సఫీయాబేగం భర్త సలిముల్లా షరీఫ్ మంగళగిరిలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు.

## మచిలీపట్నం లో ఎంపీ ఫ్లెక్సీ వివాదం

మచిలీపట్నం కృష్ణా జిల్లా మచిలీపట్నం లో ఎంపీ బాలశౌరి ఫ్లెక్సీ వివాదం నగరం లో సంచలనంగా మారింది. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి ఫ్లెక్సీ బ్యానర్ గుర్తు తెలియని దుండగులు చించివేసారు. దాంతో అయన వర్గీయులు రోడ్డుపై నిరసన తెలిపారు. కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. .

## రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన రాధా

వీరులపాడు చరిత్ర సృష్టించిన వ్యక్తి వంగవీటి మోహన రంగా ఆయన మరణించి 33 సంవత్సరాల అవుతున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 600 విగ్రహాలు ఆయన అభిమానులు ఏర్పాటుచేశారని పేద బడుగు బలహీన వర్గాల గుండెల్లో ఇప్పటికి నిలిచిపోయి ఉన్నాడని జైలు జీవితం గడుపుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏకైక వ్యక్తి రంగా అని రిక్షా కార్మికున్ని చెప్పులు కుట్టే లాంటివారిని కార్పొరేటర్ గా చేసిన ఘనత మోహనరంగా నేనని రంగా కుమారుడు రాధ తెలిపాడు వంగవీటి మోహన రంగాను అతి దారుణంగా హత్య చేసిన వ్యక్తులు ఇంకా ఉన్నారని వారి స్వార్థ రాజకీయాల కోసం ఆయన హత్య చేశారని ఆయన చనిపోతే 40 రోజులు కర్ఫ్యూ విధించారని గుర్తుచేశారు జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను తెలిపారు. వీరులపాడు మండలం నరసింహారావు పాలెం గ్రామంలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా, కృష్ణదేవరాయల విగ్రహాలను ఆయన కుమారుడు వంగవీటి రాధా ఆవిష్కరించారు.

## తుగ్గలి లో మూడు రోజులపాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

### మండల కన్వీనర్ జిట్టా నాగేష్

తుగ్గలి తుగ్గలి మండలంలో మూడు రోజులపాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జిట్టా నాగేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం రోజున ఆయన మాట్లాడుతూ 22 వ తేది గురువారం రోజున సాయంత్రం మూడు గంటల నుండి శభాష్ పురం గ్రామంలో,23వ తేదీ శుక్రవారం రోజున ఉదయం ఎనిమిది గంటలకు పై చింతలకొండ గ్రామంలో,24వ తేదీ ఉదయం 8 గంటల నుండి దిగువచింతల కొండ మరియు గుడిసెగుప్పరాళ్ల గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారని మండల కన్వీనర్ జిట్టా నాగేష్ తెలియజేశారు. మండల పరిధిలో మూడు రోజులపాటు నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలియజేశారు.

## గుడులను టార్గెట్ చేసిన దొంగలు

ఏలూరు దేవాలయాల్లో వరుస చోరీలు కలకలం రేపుతున్నాయి. దేవుడి హుండీ సొమ్ములు,నగలను ఒక ముఠా టార్గెట్ చేసింది. గత కొన్ని రోజుల క్రితం నూజివీడు పట్టణంలోని అష్టలక్ష్మి ఆలయంలో హుండీ పగలగొట్టి చోరీ చేసారు దండగులు. తాజాగా నూజివీడు మండలం జంగంగూడెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో 1లక్షన్నర విలువ చేసే వెండి తొడుగును దొంగిలించారు. ఆలయాలను టార్గెట్ చేస్తున్న దొంగల ముఠా కోయసం పోలీసులు గాలింపు ప్రారంభించారు.

## బుధవారం తుమ్మలగుంటలో చెవిరెడ్డి మణిరెడ్డి దహనక్రియలు

### ఉదయం 9 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభం
### - తుమ్మలగుంట స్మశాన వాటికలో అంత్యక్రియలు

తిరుపతి రాష్ట్ర ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి (మణి రెడ్డి) సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన మరణంతో ఆ కుటుంబంలో విషాదం నిండుకుంది. మణిరెడ్డి అంత్యక్రియలు బుధవారం తుమ్మలగుంట స్మశాన వాటిలో జరపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు గ్రామంలోని ఎమ్మెల్యే చెవిరెడ్డి ఇంటి నుంచి అంతిమ యాత్ర ప్రారంభమై 11 గంటలకు దహన క్రియలు ముగించనున్నారు.సిపిఐ నేత హరినాద్ రెడ్డి నివాళిచెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి(మణి రెడ్డి) పార్థివ దేహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి నివాళులు అర్పించారు. మంగళవారం ఉదయం పార్టీ నాయకులతో కలిసి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్వగృహానికి చేరుకొని సుబ్రహ్మణ్యం రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో హరినాథ్ రెడ్డితో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి యూత్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కత్తి రవి ఏఐఎస్ఎఫ్ మురళి తదితరులు పాల్గొన్నారు

## పట్టణంలోకల్వర్టులను ధ్వంసం చేసిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీ గారికి ఫిర్యాదు చేసిన సిపిఐ జిల్లా బృందం....

కల్వర్టులను కూలదోసి కాంప్లెక్స్ కడుతుంటే అధికారులు కళ్ళు మూసుకొని ఉన్నారా !...
ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయకుంటే జిల్లా వ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తానీ ! సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరిక...



బద్వేలు, బద్వేల్ పట్టణంలో అనుబంధంగా ఉన్న మోరీలను ధ్వంసం చేసి అక్రమ వ్యాపార సముదాయాలను నిర్మించుకున్న అధికార పార్టీ నాయకులపై కేసులు నమోదు చేసి వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కడప జిల్లా సమితి కార్యదర్శి గాలి చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నాడు బద్వేల్ పార్టీ నాయకత్వంతో కలిసి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పిడి గారిని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ.... బద్వేల్ పట్టణంలో కాదేది కబ్జాకు అనర్హం అన్న చందంగా అధికార పార్టీ నాయకులు ఇప్పటికే పట్టణంలోని కొండలు గుట్టలు ప్రభుత్వ బంజరు భూములు సైతం ఆక్రమించి దర్జాగా కబ్జా చేసి కోట్లాది రూపాయలు సంపాదించుకుని, నేడు ఇవి చాలవన్న చందంగా నేడు నేషనల్ హైవే యాక్ట్ ను సైతం తుంగలో తొక్కి జాతీయ రహదారి పైన ఉన్న కల్వర్టులను ( మోరి) ధ్వంసం చేసి దర్జాగా వారి కాంప్లెక్స్ లకు, ఇళ్లకు దారులు వేసుకుంటున్నారని, పట్టణంలోని చెన్నంపల్లె మిట్ట నుంచి మడకలవారిపల్లె వరకు 12 కల్వర్టులు ఉండగా అన్ని ఆక్రమణ గురి అయినాయని ఇవి చేసింది ఎవరో కాదని సాక్షాత్తు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి మరియు బద్వేల్ జెడ్పిటిసి బంధువులు, వైసీపీకి చెందిన పాటూరి నరసింహారెడ్డి ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ కల్వర్టులను పగలగొట్టిన వారు మాకు పట్టాలు, ఎఫ్ఎంబిలు ఉన్నాయని ఊదరగొడుతున్నారని ఏదైనా స్థలానికి తన ఇంటి ముందు 40 శాతం స్టెప్ బ్యాగ్ వదలాలని కనీసం అప్రోచ్ రోడ్ కూడా లేకుండా ఒక జాతీయ రహదారి కల్వర్టులను ఏ విధంగా పగలగొడతారని ఆయన ప్రశ్నించారు.

# పోలీస్ శాఖలో విడుదల చేసిన నోటిఫికేషన్ లో అభ్యర్థులకు 5 సంవత్సరాల వయోపరిమితి పెంచాలి......



### డివైఎఫ్ఐ, తెలుగు యువత డిమాండ్..

బద్వేలు, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సై కానిస్టేబుల్ ఉద్యోగాల సంఖ్యను పెంచాలని అభ్యర్థుల వయోపరిమితిని మరియు పరీక్ష సమయం గడువు పెంచాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలుగు యువత కడప జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షులు షేక్ జహంగీర్ భాష లు డిమాండ్ చేశారు మంగళవారం డివైఎఫ్ఐ తెలుగు యువత యువజన సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందిఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జాంగిర్ భాషలు మాట్లాడుతూ..... నిరుద్యోగులు గత నాలుగు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పోలీస్ నోటిఫికేషన్ వల్ల తీవ్ర నిరాశకు గురయ్యారు అని వారన్నారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాలు వయోపరిమితి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు ప్రతి ఏటా నోటిఫికేషన్ ఉంటుందని మాట ఇచ్చి ఇప్పుడు మడమ తిప్పడం ఏమిటని వారు అన్నారు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గతంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉపయోగపరిమితిని ఐదు సంవత్సరాల కు పెంచాలని ఆందోళన చేస్తే వారిపైన అక్రమ కేసులు బనాయించారని కనీసం డిజిపి గారికి వినతి పత్రం ఇస్తామని చెప్పిన మీడియాతో కూడా మాట్లాడనివ్వకుండా పోలీసులు అక్రమంగా నిరుద్యోగ అభ్యర్థులను మరియు డివైఎఫ్ఐ నాయకులను ఈడ్చు కుంటూ అరెస్టులు చేసి విజయవాడ గవర్నర్పేట పోలీస్ స్టేషన్ కు తరలించడం సిగ్గుచేటు అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సై కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేయడానికి 6511 పోస్టులను విడుదల చేసింది అందులో కానిస్టేబుల్ పోస్టులకు 24 సంవత్సరాలు వరకు ఉండడంతో నిరుద్యోగ అభ్యర్థులలో ఆందోళన మొదలైందిని రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాల వయోపరిమితిని పెంచాలని కోరారు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి హోం శాఖ మంత్రి తానేటి వనిత గారిని కలిసిన ఐదు సంవత్సరాల వయోపరిమితి పై ఎలాంటి హామీ రాకపోవడంతో నిరుద్యోగ అభ్యర్థులలో ఆందోళనకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి గారు వెంటనే స్పందించి వయోపరిమితి ఐదు సంవత్సరాలు పెంచి పరీక్షలు ఒక నెల వాయిదా వేయాలని లేనిపక్షంలో అన్ని యువజన సంఘాలను మరియు నిరుద్యోగులను కలుపుకొని ఆందోళన పోరాటం ఉ ధృతం చేస్తామని వారు హెచ్చరించారు సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు ప్రవీణ్ కుమార్ తెలుగు యువత నాయకులు ఎస్.కె రఫీ తదితరులు పాల్గొన్నారు

# సీయం జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు

---నంద్యాల ఎమ్మెల్యే. రెడ్ క్రాస్ ఛైర్మన్ దస్తగిరి

నంద్యాల :- ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరాలలో మంగళవారం రక్తదానం ప్రమాణ పత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి. డిసెంబర్ 21 గౌరవ ముఖ్యమంత్రి శ్రీ మోహన్ జగన్మోహన్ రెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 175 నియోజకవర్గాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు . అందులో భాగంగా రక్తదాన శిబిరాలలో రక్తదాతలచే నమోదు చేసే ప్రమాణ పత్రాలను ఎమ్మెల్యే శిల్పా మోహన్ రెడ్డి నంద్యాల ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పివి నాగిరెడ్డి , నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్ , పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, రెడ్ క్రాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నంద్యాల మార్కెట్ యార్డ్ ఆవరణంలో రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులు, అత్యధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారితో పాటుగా, ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు కూడా సేవలందిస్తాయని ప్రతి ఒక్క రక్తదాతతో ప్రమాణ పత్రం తీసుకుంటామన్నారు. రాష్ట్ర రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఎక్కువగా వచ్చిన రక్తాన్ని అవసరమైన వివిధ రాష్ట్రాలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో బండి ఆత్మకూరులో బేతంచర్ల లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



# కాల్వలు రోడ్లు పరిశుభ్రతే లక్ష్యం



నంద్యాల :-. పట్టణంలో కాలువలు , రోడ్లను శుభ్రం చేయాలని పారిశుధ్య కార్మికులకు , కమిషనర్ రవి చంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. పరి శుభ్రత లో భాగంగా పట్టణంలోని నడిగడ్డ- 1. మూడవ వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు , సిబ్బందితో కలిసి అవగాహన నిర్వ హించారు. ఈ సందర్భంగా అక్కడి కాలువల వెంట పేరుకుపోయిన చెత్త చెదారం, ఇతర వ్యర్థాలను ఏరి శుభ్రం చేయాలని తగు సూచనలు చేశారు . అనంతరం కమిషనర్ రవి చంద్రా రెడ్డి మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు పౌరులు, వ్యాపారులకు తగిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. కాలువల్లో వ్యర్థాలు ఇష్టానుసా రంగా వేయడంతో దిగువ ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. కాలుష్యకారక ప్రాంతాలపై ఇప్పటికే అవగాహన కల్పించామని తెలిపారు. హోటల్ యజమానులు, ప్రజలు పాల్గొని జలకా లుష్యాన్ని నివారించేందుకు సహకరించాలని కోరారు. కాలువలపై ఉన్న వంతెనల వద్ద ప్ర త్యేకంగా కంచె అమర్చాలని హెచ్చరిక బోర్డు లను ఏర్పాటు చేయాలని సిబ్బంది కి సూచించారు.

# సామ్ కు కోపం వచ్చినప్పుడు ఏం చేస్తుందో తెలుసా?



సమంత.. తెలుగు తమిళ భాషల్లో ఈ పేరు తెలియని ప్రేక్షకుడు లేడు. ఉ భయ ఇండస్ట్రీల్లో సమంత స్టార్ హీరోయిన్ గా మంచి గుర్తింపుని సొంతం చేసుకోవడమే కాకుండా నటిగా కూడా మంచి మార్కులు కొట్టేసింది. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' సిరీస్ తో నేషనల్ వైడ్గా గుర్తింపునిని సొంతం చేసుకుని సంచలనం సృష్టించింది. ఈ సిరీస్ లో డీ గ్లామర్ పాత్రలో రాజీగా నటించి బోల్డ్ సీన్ లతో టాక్ ఆఫ్ ఇండియాగా నిలిచింది. ఈ సిరీస్ తో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సమంత ఆ తరువాత నుంచి లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచింది.ప్రస్తుతం రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో కలిసి రొమాంటిక్ ఎంటర్ టైనర్ గా శివ నిర్మాణ తెరకెక్కిస్తున్న 'ఖుషీ' మూవీలో నటిస్తోంది. తను నటించిన మహిళా ప్రధాన చిత్రాల్లో సరోగసీ మాఫియా నేపథ్యంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'యశోద' రీసెంట్ గా విడుదలైన విషయం తెలిసిందే.గుణశేఖర్ దర్శకత్వంలో సమంత నటిస్తున్న మైథలాజికల్ మూవీ 'శాకుంతలం' త్వరలో రిలీజ్ కి రెడీ అవుతోంది. 3డీ ఐమ్యాక్స్ ఫార్మాట్ లలో ఈ మూవీని భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయబోతున్నారు.నీలిమ గుణ నిర్మిస్తున్న ఈ మూవీపై భారీ అంచనాలే వున్నాయి. మైథలాజికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీని స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూట్ చేయబోతున్నారు. ఇదిలా వుంటే రీసెంట్ గా తను మయోసైటీస్ అనే వ్యాధితో బాధపడుతున్నానంటూ సోషల్ మీడియా వేదికగా ప్రకటించి సమంత అభిమానులకు షాకిచ్చింది. ప్రస్తుతం కోలుకుంటున్న సమంత ఓ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ పలు ఆసక్తికర విషయాల్ని వెల్లడించింది.తనకు కోపం వచ్చినప్పుడు జిమ్ కు వెళ్లి తనకు ఇష్టం వచ్చినట్టుగా వర్కవుట్ లు చేస్తానని దాంతో నా కోపం తగ్గిపోతుందని తెలిపింది. తాను డబ్బు పేరు ప్రఖ్యాతుల కోసం ఆరాటపడనని తనకు డబ్బు కన్నా నటనే ముఖ్యమంది. నటించే ప్రతి పాత్రని ఆస్వాదిస్తానని అలా నటించకపోతే ఎలాంటి సంతోషం ప్రయోజనం వుండదని తెలిపింది. ఈ విషయంలో నాకు నేనే పెద్ద విమర్శకురాలినని మన తప్పులు పొరపాట్లని మనం సరిదిద్దుకున్నప్పుడే వృత్తిలో ఉన్నత స్థాయికి వెళ్లగలమని స్పష్టం చేసింది.అంతే కాకుండా కాలం కలిసి రాకపోతే ఏదీ జరగదని అలాంటి సమయం ఎదురైనప్పుడు దాని గురించి చింతించకుండా హాయిగా నిద్రపోతానంటోంది. నీకు నచ్చినట్టుగా నువ్వుండు..నువ్వు ఈ భూమి మీదికి వచ్చింది ఇతరుల మెప్పు పొందడానికో.. ఇతరులని సంతోష పెట్టడానికో కాదు. సమయం.. సందర్భం అనుకూలంగా మారితే అవసరమైన వన్నీ అవే మనల్ని వెతుక్కుంటూ వస్తాయని లైఫ్ ఫిలాసఫీని చెప్పుకొచ్చింది సామ్.

# సంజయ్ దత్ టాలీవుడ్ డెబ్యూ ఇదేనా?

బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ టాలీవుడ్ డెబ్యూ ఫిక్సైందా? ఓ వైవిధ్యమైన పాత్రతో ఖల్నాయక్ తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించడా నికి రెడీ అవుతున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. ఇప్పటికే సంజయ్ దత్ కేజీఎఫ్ చాప్టర్ -2 లో అధీర పాత్రలో సౌత్ ఆడియన్స్ ని ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. అధీర ఆహార్యం సహ పాత్రలో దత్ ఒదిగిపోయారు. ఆహార్యానికి తగ్గట్టు అధీర పాత్ర పేరు అంతే హైలైట్ అయింది. భారీ యాక్షన్ సన్నివేశాల్లో దత్ మార్క్ పెర్ఫార్మెన్స్ అందర్నీ ఆకట్టుకుంది.ఇప్పుడదే ఖల్నాయక్ ఓ తెలుగు సినిమాలో తాతయ్య పాత్ర పోషించడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. డార్లింగ్ ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో 'డీలక్స్ రాజా' అనధికారిక టైటిల్ తో ఓ సినిమా తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇది తాత-మనవడు-ఓ సినిమా థియేటర్ నేపథ్యంలో సాగే కథ. ఇందులో రెండు విభిన్న పాత్రల్లో డార్లింగ్ కనిపిస్తున్నట్లు ఇప్పటికే ప్రచారంలో ఉంది.ఒక పాత్రలో యువకుడిగానూ..మరో పాత్రలో తాతయ్యగానూ కనిపించే అవకాశం ఉందని ప్రచారం సాగింది. అయితే తాజా సమాచారం ప్రకారం ఆ తాత పాత్రని బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కి అప్పగించినట్లు తెలుస్తోంది.మారుతీ వినిపించిన కథ నచ్చడంతో సంజయ్ దత్ సినిమాకు సంతకం చేసినట్లు తెలుస్తోంది. అందుకు గానూ భారీగానే పారితోషికం చెల్లిస్తున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 2023 నుండి సంజయ్ దత్ ఈ సినిమాకు డేట్స్ కూడా కేటాయించారని వినిపిస్తుంది.ఈ చిత్రంలో ప్రభాస్కి బామ్మగా బాలీవుడ్ నటి జరీనా వహాబ్ ఇప్పటికే ఎంపికైంది. ఆలెక్కన తాత పాత్ర సంజయ్ దత్ పోషిస్తే జరీనా వహాబ్ కి భర్త పాత్రగా కనిపించొచ్చు. ఇప్పటికే ఈసినిమాకి సంబంధించి రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. కొద్ది రోజులుగా ఈ సినిమా షూటింగ్ కి నిరవధికంగా హాజరయ్యారు.వచ్చే ఏడాది మొదట్లో లాంగ్ షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారు. అప్పటి నుంచి తన పాత్ర షూట్ మొత్తం పూర్తిచేసేవరకూ మరో సినిమా సెట్ లో కాలు పెట్టరని సమాచారం. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఇందులో డార్లింగ్ కి జోడీగా మాళవిక మోహనన్.. నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ భారీ సెట్ లోనే ఎక్కువ భాగం షూటింగ్ జరుగుతోంది.




# బాబర్ చెత్త కెప్టెన్.. జీరో.. కోహ్లితో పోల్చడం ఆపేయండి: పాక్ మాజీ క్రికెటర్ ఫైర్



పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజంపై ఆ జట్టు మాజీ క్రికెటర్ దానిష్ కనేరియా మండిపడ్డాడు.సారథిగా బాబర్ ఓ సున్నా అని, ఇకనైనా అతడిని టీమిండియా స్టార్ విరాట్ కోహ్లితో పోల్చడం ఆపేయాలని కోరాడు. కోహ్లితో పోల్చదగిన క్రికెటర్లెవరూ పాక్ జట్టులో లేరంటూ ఘాటు విమర్శలు చేశాడు. కాగా ఇంగ్లండ్‌తో స్వదేశంలో జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లోబాబర్ ఆజం బృందం వైట్‌వాష్‌కు గురైనవిషయం తెలిసిందే.ఇప్పటికే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించిన పాక్... సొంతగడ్డపై దారుణ వైఫల్యం కారణంగా విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఆ జట్టు మాజీ లెగ్ స్పిన్నర్ దానిష్ కనేరియా పాక్ ఆట తీరుపై మండిపడ్డాడు. బాబర్ ఆజంకు కెప్టెన్‌గా ఉండే అర్హత లేదంటూ విమర్శించాడు.పాక్ జట్టులో అలాంటి వాళ్లు లేరుఈ మేరకు తన యూట్యూబ్ చానెల్ వేదికగా కనేరియా మాట్లాడుతూ.. "దయచేసి ఇప్పటికైనా బాబర్ ఆజంను కోహ్లితో పోల్చడం ఆపేయండి. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ గొప్ప ఆటగాళ్లు. వాళ్లతో పోల్చదగిన క్రికెటర్లెవరూ పాక్ జట్టులో లేరు.ఒకవేళ ఎవరైనా వాళ్లలా ప్రశంసలు అందుకోవాలంటే ఆటలో రారాజై ఉండాలి. మెరుగైన ప్రదర్శన కనబరచాలి. లేదంటే జీరోలు అవుతారు. ఇక బాబర్ ఆజం కెప్టెన్‌గా ఓ పెద్ద సున్నా. అతడికి నాయకుడిగా ఉండే అర్హత లేదు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో జట్టును ముందుకు నడిపే సామర్థ్యం, నాయకత్వ ప్రతిభ అతడికి లేవు" అని బాబర్ ఆజంపై విమర్శలు గుప్పించాడు.ఇగో పక్కన పెడితేనేఇక ఇంగ్లండ్‌తో సిరీస్ ద్వారా కెప్టెన్ బెన్ స్టోక్స్, కోచ్ బ్రెండన్ మెకల్లమ్ నుంచి కెప్టెన్సీ మెళకువలు నేర్చుకునే అవకాశం బాబర్‌కు దక్కిందన్న కనేరియా.. ఇకనైనా ఇగోను పక్కనపెట్టి పాక్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ సలహాలు తీసుకోవాలని సూచించాడు. కాగా ఇంగ్లండ్ చేతిలో ఓటమితో బాబర్ ఆజం ఓచెత్త రికార్డుమూటగట్టుకున్నాడు. స్వదేశంలో వరుసగా నాలుగు టెస్టు మ్యాచ్‌లు ఓడిన మొదటి పాక్ కెప్టెన్‌గా నిలిచాడు.

### ఎల్ఓసి మంజూరు చేయించిన జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని మంథని నియోజకవర్గ పరిధిలోని మహాముత్తారం మండల కేంద్రానికి చెందిన పెరుమండ్ల రమేష్ అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ సహాయం కొరకు మంథని నియోజకవర్గ భీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ను సంప్రదించగా ఆయన స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తనీ 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి మంజూరు చేయించారు. పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ వ్యక్తిగత సహాయకుడు నిమ్స్ హాస్పిటల్ కు వెళ్లి మంగళవారం ఎల్ఓసి పత్రాలను వారికి అందజేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190